క్లుప్తంగా

రేపు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీ ఉదయం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఈఓ భ్రమరాంబ మంగళవారం తెలిపారు. ఆ రోజు తెల్లవారుజాము 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితార, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా మహా మండపానికి చేరుతుందని వివరించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో పాటు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తజనుల కోలాట నృత్యాల మధ్య గిరి ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు.

రేపు సిద్ధార్థ ఆడిటోరియంలో జానపద గీతాలాపన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 31వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు జానకీరావు బృందంతో జానపద గీతాలాపన కార్యక్రమం జరుగుతుందని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన యువజనోత్సవ పోటీల్లో జానకీరావు బృందం నాలుగు సార్లు ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ ప్రదర్శనను ఉచితంగా తిలకించొచ్చని సూచించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఉదయం 63వ డివిజన్ 279వ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉడా కాలనీ, రాజీవ్ నగర్‌లో ఆయన పర్యటిస్తారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, పసుపులేటి ఏసు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవీ..

మధురానగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, సిటీ సబ్ స్టేషన్, 11 కేవీ నక్కలరోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కల రోడ్డు, గోపరాజు రామచంద్రరావు వీధి, చిలుకు దుర్గయ్య వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, నరసింహారావు నాయుడు వీధి, కాశేశ్వరావు రోడ్డు, వెంకటరత్నం వీధి, ఏలూరు రోడ్డు, సోనోవిజన్ (పాత విజయా టాకీస్) ఏరియా, విష్ణు వర్ధనరావు వీధి, పీసపాటివారి వీధి, తాడేపల్లి వారి వీధి, కోకా చలపతిరావు వీధి, డోర్నకల్ రోడ్ ఎండోకేర్ హాస్పిటల్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

ఏళ్ల తరబడి నిరీక్షణకు మోక్షం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో మూడవ వార్డులో వాడుకలో లేని చెరువు స్థలంలో నివాసం ఉంటున్న కుటుంబాలకు ఇళ్ల పట్టాలను ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని నున్న పంచాయతీ సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన గ్రామ పంచాయతీ సమావేశం మంగళవారం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉత్తరం వైపు ఆర్‌ఎస్ నంబరు 537లో సుమారు 50 సంవత్సరాలుగా 300 కుటుంబాల వారు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. వారు అనేక దఫాలు ఇళ్ల పట్టాలకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఇటీవల ఒక కార్యక్రమానికి నున్న గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను స్థానికులు కలిసి తమకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయించాలని విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులతో మాట్లాడి 537 సర్వే నంబరులో ఉంటున్న కుటుంబాలకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని కోరారు. ఈ విషయమై విజయవాడ రూరల్ మండల రెవెన్యూ అధికారులు విచారణ చేసి ఇళ్లపట్టాలను మంజూరు చేయడానికి స్థానిక గ్రామ పంచాయతీ ఎన్‌ఓసీ కోరారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం గ్రామంలో రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి సాంకేతిక అనుమతులు లభించినట్టు గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ తెలియజేశారు. పిమ్మట 9వ వార్డు ఉప ఎన్నికలో గెలుపొందిన వల్లూరు వెంకటశివతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

కేసరపల్లి(గన్నవరం): ఇల్లు కోల్పోయిన బాధితురాలికి ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. కేసరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు ఆంజనేయ వరప్రసాద్ చేతుల మీదుగా బాధితురాలికి నగదు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామానికి చెందిన కొడవలి పాప ఇల్లు కూలిపోయి నిరాశ్రయురాలైందని, ఆమె పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి తన వంతు సాయం చేసినట్లు తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



విజేతలతో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ



గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు వ్యవహారిక భాష కోసం ఉద్యమించిన గిడుగు రామ్మూర్తి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు కోరారు. ముత్యాలంపాడులోని శ్రీఅల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా మంగళవారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నరసరాజు పాల్గొని గ్రంథాలయం అధ్యక్షుడు కె.సుబ్బరాజు, సాంస్కృతిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.వి.సుబ్బరాజు, పి.వి.సుబ్బరాజు, కె.ఎస్. ప్రసాదరాజుతో కలిసి గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు చేసి సేవలను కొనియాడారు. గ్రంథాలయం కార్యదర్శి పి.వి.సుబ్బరాజు, కోశాధికారి టి.శ్రీనివాసరాజు, సాంస్కృతిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన తెలుగు భాషా వారోత్సవాలు

మాచవరం సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు భాషా వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ తెలుగు భాష విశిష్టతను వివరించారు. తెలుగు భాషా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీలవిజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డాక్టర్ బాలకృష్ణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాషోద్యమ నాయకుడు గిడుగు

పాయకాపురం(విజయవాడరూరల్): తెలుగు భాషోద్యమ నాయకుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. పాయకాపురం 61వ డివిజన్ పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యఅతిథి తోట శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఆడుదాం ఆంధ్ర పేరుతో అక్టోబర్‌లో క్రీడాపోటీలను నిర్వహించనుందన్నారు. గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రీడాపరికరాలను అందచేశారు. 61వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బల్లం కిషోర్, పార్టీ నాయకులు అన్నపురెడ్డి రామిరెడ్డి, దాసం దుర్గారావు, దేవళ్ల అశోక్, కె.ఫణికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు జయంతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వ్యవహారిక తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్ గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు భాష ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఠాగూర్‌స్మారక గ్రంథాలయంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మంగళవారం తెలుగు భాషాదినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు భాషకు గిడుగు చేసిన సేవలను కొనియాడారు. పాఠశాల విద్యార్థులకు వేమన పద్యాలు, మాతృభాషలో విద్యాబోధన అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, వై.ధనలక్ష్మి, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న తోట శ్రీనివాస్



ముత్యాలంపాడులో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సప్తగిరి కళాశాలలో..

సప్తగిరి కళాశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ మన్మధరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిడుగు సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్ జ్యోత్స్నరాణి రచించిన విద్యార్థి వ్యాస కృత్యాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.డి.శ్రీదేవి, ఆర్ రఘురామ్, ఎన్ వెంకట్‌రావు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సుస్థిర ఆర్థిక ప్రగతి లక్ష్యాల వైపు అడుగులు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శక పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. 30వ డివిజన్ 242వ వార్డు సచివాలయ పరిధిలో కార్పొరేటర్ బి.జానారెడ్డితో కలిసి ఆయన మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రామకృష్ణాపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను, వాటి ద్వారా వారికి కలిగిన లబ్ధిని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తూ.. సుస్థిర ఆర్థిక ప్రగతి లక్ష్యాల వైపు అడుగులు వేస్తోందని తెలిపారు. పేదలకు నవరత్నాలు ద్వారా చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధితో కూడిన బుక్‌లెట్లను పంపిణీచేశారు.

మంచి చేస్తున్న ప్రభుత్వంపై దాడి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంటున్నాయని పేర్కొన్నారు. రోజురోజుకూ ప్రజల్లో ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను ఓర్వలేక ప్రతిపక్షాలు ముప్పేట దాడి చేస్తున్నాయని మండిపడ్డారు. పేదలకు చేస్తున్న మంచిని కూడా తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ పాలనలో పదేళ్ల వెనక్కి వెళ్లిన విజయవాడ నగరానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతనే కొత్త కళ వచ్చిందన్నారు. తమను గెలిపించిన ప్రజలకు తాము చేసిన మంచిని గడప గడపకు వెళ్లి చెప్పగలుగుతున్నామని, టీడీపీ హయాంలో పేదలకు ఏం చేశారో చెప్పే ధైర్యం ఉందా అని సూటిగా ప్రశ్నించారు. సెల్ఫీలతో ప్రజలను మభ్య పెట్టడం కాదని.. దమ్ముంటే ప్రజాక్షేత్రంలో చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

దొంగ ఓట్ల పాపం చంద్రబాబుదే..

రాష్ట్రంలో దొంగ ఓట్ల పాపం ముమ్మాటికీ చంద్రబాబుదేనని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల దొంగ ఓట్లు నమోదయ్యాయని, అప్పట్లో ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లామని గుర్తుచేశారు. వైఎస్ జగన్ నాయకత్వంలో ఎంపీలు అందరూ ఢిల్లీకి వెళ్లి పిటీషన్లు కూడా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ రామకృష్ణ, సీడీఓ జగదీశ్వరి, నాయకులు మార్తి చంద్రమౌళి, వి.రమేష్, పవన్‌కుమార్‌రెడ్డి, గోపిశెట్టి శ్రీను, నగర ప్రసాద్, ఎస్.రామకృష్ణ, డి.కృష్ణ, భోగాది మురళి, గోళ్ల శ్రీను, డి.దుర్గారావు, సామంతకూరి దుర్గారావు, మస్తాన్ వలి, రాజు, వర్మ, రఫీ, బెజ్జం రవి పాల్గొన్నారు.

పరిశీలన గృహం బాలురకు దుస్తుల పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ పరిశీలన గృహంలోని బాలురకు మంగళవారం దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి పి.రాజారాం విచ్చేసి బాలురకు దుస్తులు అందజేశారు. హైదరాబాద్‌లోని కాకతీయ విద్య ట్రస్ట్, కృష్ణా జిల్లా బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ) సభ్యురాలు చంద్రగిరి రాధాకుమారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి రాజారాం మాట్లాడుతూ.. చిన్నారులు చెడు స్నేహాలు చేయవద్దని, అసాంఘిక చర్యలకు పాల్పడి తల్లిదండ్రులను ఆభాసుపాలు చేయవద్దని సూచించారు. బాగా చదువుకుని మంచి ఉద్యోగం సాధించి సంఘంలో గౌరవ, ప్రతిష్టలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశీలన గృహం ఆవరణలోని పెరటితోట (కిచెన్ గార్డెన్)ను అతిథులు ప్రారంభించారు. కాకతీయ విద్యా ట్రస్ట్ ప్రతినిధులు బొర్రా రాధాకృష్ణ, కోనేరు వెంకట రామారావు, తోటకూర శ్రీనివాసరావు, గరిమెళ్ల రాంప్రసాద్, విద్యా కమిటీ సభ్యులు జి.వాణి, ఎస్.మాలతి, ఎ.సుమలత, లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ జె.జయలక్ష్మి, పర్యవేక్షణాధికారి పి.రామ్మోహనరెడ్డి, ప్రొహిబిషన్ ఆఫీసర్ ఎండీ హుస్సేన్ అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీచేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాజారాం తదితరులు

దుర్గగుడిలో శాస్త్రోక్తంగా ఉదకశాంతి



ఉదకశాంతి నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సాయంత్రం ఉదకశాంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ముందు రోజు ఉదకశాంతి నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైదిక సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓ భ్రమరాంబ, ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

మధురంగా సాగిన సంగీత గాత్ర కచేరీ



కీర్తనలను ఆలపిస్తున్న తులసీ విశ్వనాథ్



తోలుబొమ్మలాట

విజయవాడ కల్చరల్: ప్రముఖ శాస్త్రీయ సంగీత కళాకారిణి సీహెచ్ తులసీవిశ్వనాథ్ ఆలపించిన కీర్తనలు అలరించాయి. నీ పాదమే గతి.. నీకేల దయరాదు.. వంటి వాగ్గేయకారుల కీర్తనలను మధురంగా ఆలపించారు. ప్రసారభారతి, విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఆధ్వర్యంలో జీ 20 వసుదైక కుటుంబం కార్యక్రమంలో భాగంగా రెండురోజులపాటు నిర్వహించే సంగీత సంధ్య మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో మంగళవారం ప్రారంభమైంది. తొలుత శాస్త్రీయ సంగీత కచేరీలో తులసీ విశ్వనాథ్ వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. బి.వి.దుర్గాభవాని వయోలిన్‌పై, బి.వి.ఎస్.ప్రసాద్ మృదంగంపై సహకరించారు. అనంతరం పసుమర్తి హనుమంతరావు బృందం జానపద కళారూపం తొలుబొమ్మలాటను ప్రదర్శించింది. మైరావణ ఇతివృత్తంగా ఈ ప్రదర్శన కొనసాగింది. చివరిగా సినీ సంగీత దర్శకుడు ప్రేమ్‌జీ ఆధ్వర్యంలో లలిత గీతాలాపన వీనులవిందుగా సాగింది. బుధవారం భక్తి సంగీత కార్యక్రమంలో వి.సరస్వతి, శాస్త్రీయ సంగీత కార్యక్రమంలో మల్లాది సోదరులు పలు గీతాలు, కీర్తనలను ఆలపిస్తారు. కె.వై.వి.ప్రసాద్ బృందం గరగ నృత్యం ప్రదర్శిస్తుంది.

లంకా సంగీత సంస్మరణోత్సవాలు ప్రారంభం

విజయవాడ కల్చరల్: లయనాద కళాస్రవంతి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఐదు రోజులపాటు నిర్వహించే లంకా వేంకటేశ్వర్లు సంగీత సంస్మరణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కె.వి.కిషోర్, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు సంగీత పాఠశాల విద్యార్థులు ఆలపించిన బృందగానం అలరించింది. భమిడిపాటి శ్రీలలిత, మల్లాది కార్తీక త్రివేణి గాత్ర సంగీతకచేరీ శ్రావ్యంగా సాగింది. లయనాద కళాస్రవంతి వ్యవస్థాపకులు కె.మాధవి మాట్లాడుతూ.. సంగీత విద్వాంసుడు లంకా వేంకటేశ్వర్లు పేరుతో ఏటా సంగీతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అభయాంజనేయుని సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన రాగిపిండి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు అంకిత్‌రెడ్డి అన్నదానానికి విరాళం అందజేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మినీ బస్ స్టేషన్ నిర్మాణానికి రూ.2 కోట్లు విడుదల

– సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వాంబే కాలనీలో మినీ బస్ స్టేషన్ నిర్మాణానికి రూ.2 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరం విస్తరించి అజిత్ సింగ్‌నగర్ ప్రాంతం కేంద్ర బిందువుగా మారిన నేపథ్యంలో ఈ ప్రాంతంలో బస్ స్టేషన్ నిర్మాణం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కలుగుతుందని మల్లాది విష్ణు ఆశాభావం వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలు వేలాది గృహాలతో నిర్మితమవుతున్న నేపథ్యంలో బస్ స్టేషన్ ఏర్పాటుకు నిధులు విడుదల కావడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ఈ బస్‌స్టేషన్ ద్వారా నున్న, సూరంపల్లి, కొండపావులూరు, జి.కొండూరు తదితర ప్రాంతాలకు సులభతర రవాణా సదుపాయం ఏర్పడుతుందని వివరించారు. బస్ స్టేషన్ నిర్మాణానికి ఏప్రిల్ 17, 2021లోనే రెండు ఎకరాల భూమిని కేటాయిస్తూ నగరపాలక సంస్థ అనుమతులు ఇచ్చిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. వీలైనంత త్వరలో బస్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఓటర్ల తొలగింపు వివరాలను సేకరించాలి

విజయవాడరూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత ఏడాది జనవరి 6వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఓటర్ల జాబితాలో నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను వెంటనే సేకరించి తెలియజేయాలని విజయవాడ రూరల్ మండల తహసీల్దారు పి.జాహ్నవిరెడ్డి వీఆర్వోలను ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వీఆర్వోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గ్రామాల్లో రీసర్వేను వేగవంతం చేయాలన్నారు. నున్న, పాతపాడు, అంబాపురం, జక్కంపూడి, గొల్లపూడి గ్రామాల మీదుగా వెడుతున్న నేషనల్ హైవే కారణంగా హైటెన్షన్ విద్యుత్ లైన్ల సర్వే నంబర్లతో రైతుల వివరాలను తెలియజేయాలన్నారు. ఆయా రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి గాను వివరాల అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో డెప్యూటీ తహసీల్దారు ఎండీ సలీమ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

భాషా వికాసానికి సాహితీవేత్తలు కృషి చేయాలి



ప్రసంగిస్తున్న వెంకటశ్రీనివాసులు

విజయవాడ కల్చరల్: భాషా వికాసానికి సాహితీవేత్తలు కృషి చేయాలని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకటశ్రీనివాసులు కోరారు. సమైక్యభారతి, జీపీ అండ్ రాజ్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటశ్రీనివాసులు మాట్లాడుతూ.. తెలుగు భాష అమృతతుల్యమైదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ ప్రముఖులు డాక్టర్ మూర్తి రేమళ్ల, ఆచార్య శ్రీనివాసరెడ్డి, సమైక్య భారతి జాతీయ అధ్యక్షుడు పి.కన్నయ్య తదితరులు భాషా వికాసం అంశంగా ప్రసంగించారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు చిత్ర గీతాలను ఆలపించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



క్రీడాకారులను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు



బహుమతులందిస్తున్న లక్ష్మణస్వామి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి సూచించారు. కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు, సిబ్బందికి మంగళవారం వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు లక్ష్మణస్వామి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుని జీవితంలో మంచి విజయాలను సాధించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ పతంజలిశాస్త్రి, అధ్యాపకుడు విజయ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పాయకాపురం(విజయవాడరూరల్): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ ఉద్యోగులకు రెండు రోజులపాటు నిర్వహించిన క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందచేశారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా డాక్టర్ కె.అనుమోల్ వ్యవహరించగా సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందచేస్తున్న వెంకటేశ్వర్లు

క్రీడాకారులకు సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన పలువురు క్రీడాకారులను మంగళవారం ఘనంగా సత్కరించారు. జాతీయ స్కేటింగ్ క్రీడాకారుడు వరుణ్ కృష్ణగౌతమ్, పలువురు స్కేటింగ్ క్రీడాకారులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గుర్రం ఏడుకొండలు, కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి డాక్టర్ బ్రహ్మాదేశం వసంత కుమార్, మురళీకృష్ణ, బచ్చు మాధవి, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

వివంతలో ఇండియా జ్యూవెలరీ షాపింగ్ ఫెస్టివల్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆభరణాల తయారీ దారులు, హోల్‌సేలర్లు, రిటైలర్లు, ఎగుమతిదారులను ఏకతాటిపైకి తీసుకొచ్చే అపెక్స్ ట్రేడ్ బాడీ ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) తన మొదటి భారత జ్యూవెలరీ షాపింగ్ ఫెస్ట్(ఐజేఎస్‌ఎఫ్)ను ప్రకటించింది. ఈ సందర్భంగా నగరంలోని వివంత హోటల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జీజేసీ జాయింట్ కన్వీనర్ మనోజ్ ఝూ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా ఆభరణాల పరిశ్రమకు, కస్టమర్లకు సహాయ పడాలని కోరుకుంటున్నామన్నారు. అందులో భాగంగా విజయవాడలో ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేఎస్ఎఫ్ కో కన్వీనర్ అశోక్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అశోక్‌జైన్, మనోజ్ ఝూ తదితరులు

అత్తింటివారి వేధింపులపై మహిళ ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): భర్తతో కలిసి అత్త, ఆడపడుచు, మరిది మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ఓ మహిళ మంగళవారం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. వాంబే కాలనీ జీ బ్లాక్‌లో నివసించే దాసరి వీరాంజనేయులుకు దాసరి సౌజన్యతో 2018వ సంవత్సరంలో వివాహమైంది. వివాహమైనప్పటి నుంచి భార్యపై అనుమానంతో వీరాంజనేయులు రోజూ మద్యం తాగొచ్చి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. కట్నం చాల్లేదని, వేరే పెళ్లి చేసుకొంటానని బెదిరించేవాడు. భర్తతో పాటు అత్త, ఆడపడుచు, మరిది కూడా వేధిస్తుండటంతో సౌజన్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.